కథా నిలయం
శ్రీకాకుళం

# ఆడతనం

"ఏమండీ ...ఈ ఒక్కసారికి నా మాట కాదనకండీ... ప్లీజ్ లాలనగా అది లత.

"అదికాదోయ్ ... నాకు అనీజీగా వుంటుంది. అర్ధం చేసుకో... అనునయంగా అన్నాడు శశిధర్.

"అబ్బ.. అందుకే... ఎంతగా చెప్పినా మళ్ళీ మొదటికే వస్తారే" బుంగమూతి పెట్టింది స్వర్ణలత.

భార్య బ్రతిమిలాట ధోరణికి సగం మెత్తబడ్డాడు శశిధర్.

"తప్పదంటావా" ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"అంత కష్టంగా వుంటే వద్దులేండి.. మీ ఇష్టం " నిష్టూరంగా అంది.

"నో...నో...నో..దేవిగారి ఇష్టం నాకు ఎప్పటికి కష్టంకాదు. ఓ.కే. అలాగే.. నీ ఇష్టప్రకారమే ఒప్పుకుంటున్నాను. రేపు వచ్చే శుక్రవారంకదా అన్నావు" అన్నాడు భార్యముఖంలో ఆనందపు వెలుగుల్ని వెతుకుతూ.

"యూ...మై డియర్" అంటూ అతని పెదాలపై ముద్దుపెట్టుకుంది లత.

ఊహించని ఆమె చర్యకు ఉబ్బితబ్బిబ్బయ్యాడు శశిధర్.

*    *    *    *

"నీ అంత అందాలరాశి నాభార్య కావటం నా అదృష్టం అనుకుంటున్నా" అన్న శశిధర్ తొలి రేయి తొలి పలుకు ఇప్పటికీ పులకింత కలిగిస్తుంది లతకి.

తన అందానికి అంతగా వివశుడైన భర్తంటే ఆమెకు పంచప్రాణాలు. కాపురానికి వచ్చినరోజు నుంచీ ఈనాటివరకు భర్తకు అందంగా కనిపించటానికే ప్రయత్నించింది స్వర్ణలత.

వయసు పై బడ్డా వార్ధక్యం దగ్గరపడుతున్నా అందుకు తగినట్లుగా ముస్తాబయే స్వర్ణలత చతురతకు ముచ్చట పడుతుండేవాడు శశిధర్.

రేపో మాపో అమ్మమ్మ, తాతయ్యలు కాబోతున్నవారు ఇప్పటికీ నిత్యనూతనంగా, ఉల్లాసంగా వుంటారు.

పెళ్లిళ్ళకు వెళ్ళినపుడో, పేరంటాల్లో చూడటం తటస్థపడినప్పుడో నిండుగా కప్పుకున్న పైటతో, పెద్దమనిషి తరహాగా, హుందాగా కనిపించే లతని చూసి అచ్చెరువొందుతాడు శశిధర్.

'రాత్రిళ్ళు గదిలోకి వచ్చేటప్పుడు రకరకాల బ్రాలతో పల్చటి నైటీలతో కనిపించి, తనని కవ్వించి, నవ్వించి, మైమరపించి, మధురానందాన్ని ఇచ్చే స్వర్ణేనా ఈమె' అనుకుంటాడు.

'అవునుమరి పదిమందిలో వున్నప్పుడు పద్ధతి ప్రకారం మసలుకుని, ఏకాంతంలో మగడి సన్నిధిలో మాత్రమే అందాల్ని బహిర్గతం చేస్తూ, భర్తని మైమరపించటమే కదూ 'శయనేషు రంభ'గా ప్రవర్తించటం' అని భార్యను మనసులోనే పొగుడ్తూ సమయం చూసి తన మనోభావాల్ని భార్యకు వినిపిస్తుంటాడు.

తనపైన, తన సౌందర్యం పైన భర్తకున్న అభిమానం వీసమెత్తుకూడా తగ్గకుండా జాగ్రత్తపడాలని ఆరాటపడుతూ, అందుకోసం రకరకాలుగా ముస్తాబులు చేసుకుంటుంది స్వర్ణలత.

భార్య అలా అలంకరించుకుని తనని అలరింపచేయటం సంతోషంగానే ఉన్నది కానీ ఇప్పుడు తనని కూడా తలకి రంగు వేసుకోమని పోరు పెట్టటం ఇబ్బందిగా అనిపించింది. ఏమైనా ఆమె కోరికకు తలొగ్గక తప్పలేదు.

అందుకే రాబోయే శుక్రవారం తమ పెళ్ళిరోజు నాటికి తలకి రంగు వేయించుకునేందుకు అంగీకరించాడు.

తన కోరికను తీర్చేందుకు అంగీకరించిన భర్తకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుని ఉబ్బితబ్బియిపోయింది. అతడి కొత్త రూపాన్ని మనసులో ఊహించుకుని మురిసిపోసాగింది.

* * * *

తలకి రంగు వేయించుకున్న శశిధర్ తెగ సిగ్గుపడిపోసాగాడు. సాయంత్రం భార్యతో కలిసి సినిమాకి, అట్నుంచి అటే హోటల్లో భోజనం చేసి ఇంటికి రావాల్సిన కార్యక్రమం ఉన్నది. ప్రతి పెళ్ళిరోజున వారి అలవాటది.

దారిలో స్నేహితులో, సహోద్యోగులో కనిపిస్తారని బిడియంగా, సిగ్గుగా బయల్దేరాడు శశిధర్. ఎప్పటిలాగా నాజూగ్గా తయారైంది స్వర్ణలత.

రిక్షాలో వెళ్తున్నప్పుడు, భార్యపక్కన నడుస్తున్నప్పుడూ ఏమిటో గిల్టీగా ఫీలవుతున్నాడు శశిధర్.

సినిమా మంచి శృంగారభరితంగా వున్న కారణంగా కాసేపు తల విషయం విస్మరించి, ఉత్తేజం పొందాడు. ఉత్సాహంగా భార్యతో పరాచికాలాడాడు సినిమా హాల్లో. హోటల్లోకూడా ఎరిగినవారు ఎదురుపడకపోవటంతో కాస్తంత ఊరట చెందాడు. పదకొండు గంటలు కావస్తుండగా ఇల్లు చేరారు ఆలుమగలు.

తలనిండా పూలతో, పల్చటి నైటీలో కొత్త అందాలు సంతరించుకున్న స్వర్ణలత పడకగదిలోకి ప్రవేశించింది.

ఆమె రాకకోసం ఎదురు చూస్తున్న శశిధర్ ఒక్కసారిగా ఆమెను బిగియారా కౌగిలించుకున్నాడు.

ఎందుకనో ఎప్పటిలా ఉత్సాహం చూపని స్వర్ణలత వంక అనుమానంగా చూశాడు. బలవంతంగా నవ్వు తెచ్చి పెట్టుకున్న భార్యను పొదివి పట్టుకుని "అలా ఉన్నావేం?" అనడిగాడు లాలనగా.

"ఏం లేదండీ... మామూలుగానే ఉన్నాను" చెప్పిందామె. ఆమె సమాధానం అతన్ని తృప్తిపరచలేదు.

ఆమెని ఉత్తేజపరచటానికి చేతుల్తో ఎక్కడెక్కడో స్పృశించాడు.

మాటల్తో మదనతాపం పెంచాలని ప్రయత్నించాడు. అయినా ఆమె ఎప్పటిలా ప్రతిస్పందించలేదు. ఉత్సాహం చూపలేదు. శశిధర్‌కి శరీరంతో పాటు మనసుకూడా వేడెక్కింది.

"నువ్వేదో దాస్తున్నావ్... నిజం చెప్పు అంటూ భార్య కళ్ళల్లోకి చూశాడు.

"నిజం చెప్పనా" బేలగా అన్నది లత. చెప్పమన్నట్లు తలాడించాడు.

"మీరు...మీరు...మీరుగా అనిపించటం లేదు. కొత్తగా వున్నారు. ఎవరో అనిపిస్తున్నారు. అందుకే.. అందుకే.. అదివరకులా అతుక్కోలేకపోతున్నాను" మనసులో మాట బయటపెట్టింది.

తలకి రంగు బాధ తప్పిందన్న సంతోషం కంటే శ్రీమతి ఆరాటం ఆగిపోయినందుకు ఆనందపడ్డాడు శశిధర్.

అంతేకాదు.

'పరాయిపైట తొలగినా తగిలినా తన్మయం చెంది రెట్టింపు ఉత్సాహంతో ఉద్విగ్నత పొందే మగవారు "మగతనం అనుకునేదానికంటే భర్తే అని తెలిసినా రూపం కొత్తగా అనిపించినంత మాత్రానే మానసికంగా విముఖత్వానికి లోనయిన ఆడతనం ఎన్నిరెట్లు నైతికంగా బలమైందో కదా!" అనుకోకుండా వుండలేకపోయాడు శశిధర్.

◆ స్వాతి సపరివార పత్రిక – 12.12.1997 ◆